

సాక్షి
పల్నాడు
గురువారం ׀ 2 ׀ నవంబర్ ׀ 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4,808 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 525 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ముప్పాళ్ల: చాగంటివారి పాలెం ఎస్టీ కాలనీలో టీటీడీ ఆధ్వర్యంలో భూ సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. టీటీడీ వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

‘ఆదర్శ’ప్రదేశ్ ఘనత సీఎం జగన్‌దే

- ప్రగతి పుణ్యం ఆయనదే
- అందుకే మళ్లీ జగన్ రావాలి
- ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం
- రేపు సామాజిక సాధికార బస్సు యాత్ర విజయభేరి మోగిద్దాం
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే)



విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, చిత్రంలో పీవీఆర్



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

మాచర్ల: రాష్ట్రాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మోడల్‌గా తీర్చిదిద్దారని, సంక్షేమం, అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) చెప్పారు. బుధవారం మాచర్ల నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం స్థానిక నెహ్రూనగర్‌లోని వీవీఎస్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్కే ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రగతి పుణ్యం సీఎం జగన్‌దేనని, అందుకే ఆయనను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2 లక్షల 70 వేల కోట్లు నేరుగా కోట్లాది మంది ప్రజలకు చేర్చి 98 శాతం వర్గాలకు ప్రయోజనం చేకూర్చారని వివరించారు. అంతకుముందు ఇదే బడ్జెట్ ఉన్నా.. 2014 నుంచి 2019 వరకు అప్పటి సీఎం చంద్రబాబు రూ.లక్ష కోట్లు అప్పుచేశారని, మరి ఆ డబ్బులు ఏమయ్యాయని పిన్నెల్లి ప్రశ్నించారు. ఏనాడైనా బాబు పేదల గురించి పట్టించుకున్నారా? అని నిలదీశారు. హైదరాబాద్ అభివృద్ధి, అమరావతి రాజధాని నిర్మాణం అంటూ అబద్ధాలు వల్లెవేసిన బాబు అవినీతి సామ్రాట్ అని విమర్శించారు. పోలవరాన్ని ఏటీఎంలా వాడుకున్నారని ధ్వజమెత్తారు. పేద ప్రజలకు ఇది చేశానని బాబు చెప్పుకోగలరా? అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, 108, 104, ప్రాజెక్టుల నిర్మాణంతో పేదల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయన వారసుడిగా సీఎం జగన్ నేడు నాలుగున్నరేళ్లుగా పేదల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని పీఆర్కే స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు అన్నివర్గాలకు న్యాయం చేసి, ప్రతి ఒక్కరికీ క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికారం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమీ చేయని బాబు అవినీతికి పాల్పడి జైలుకు వెళ్లారని, ఆయనకు సీఎం జగన్‌ను విమర్శించే అర్హత లేదని పీఆర్కే స్పష్టం చేశారు. సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనదేనని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్దామని సూచించారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. గ్రామాల్లో రాత్రి బస చేసి సమస్యలు పరిష్కరిద్దామని, ఎల్లో మీడియా, ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొడదామని వెల్లడించారు.

బస్సు యాత్రలో భాగస్వాములమవుదాం

నియోజకవర్గంలో ఈనెల 3న సామాజిక సాధికార బస్సు యాత్ర జరగనుందని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. దీనిని జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ యాత్రకు మంత్రులు, ప్రజాప్రతినిధులు వస్తున్నారని, వారికి ఘన స్వాగతం పలుకుదామని వివరించారు. రెంటచింతల నుంచి మాచర్ల దాకా జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో వేలాదిగా కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(పీవీఆర్) మాట్లాడుతూ బస్సు యాత్రకు ప్రజలు అశేషంగా తరలిరావాలని కోరారు. బహుజనుల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, చైర్మన్‌లు, మాజీ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, మండల కన్వీనర్లు, సింగిల్ విండో సభ్యులు, కార్పొరేషన్ సభ్యులు, మాజీ మండల అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

బస్సుయాత్రపై సమీక్ష

మాచర్ల: నియోజకవర్గంలో శుక్రవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేసేందుకు అందరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. బుధవారం మార్కెట్ యార్డు ప్రాంగణంలో యాత్ర సన్నాహక ఏర్పాట్లపై పీఆర్కే సమీక్షించారు. కార్యకర్తలు, నేతలతో చర్చించారు. సమీక్షలో రెంటచింతల, మాచర్ల, ఇతర మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మాచర్ల పట్టణం, దుర్గి, కారంపూడి మండలాల నాయకులతో గురువారం పీఆర్కే, పీవీఆర్ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు.

ఉన్నత శిఖరాలెక్కేస్తాం

గణితమంటే భయం పోయే

- "సాక్షి" మ్యాథ్స్ బీకి విశేష స్పందన
- గుంటూరు నగరంలోని పాఠశాలల్లో పరీక్ష
- ఉత్సాహంగా పాల్గొన్న 338 మంది విద్యార్థులు



గోరంట్ల విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సాక్షి మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో గణితశాస్త్రంపై నెలకొన్న భయాన్ని దూరం చేసి, కఠినమైన లెక్కలను సులువుగా పరిష్కరించే నైపుణ్యాన్ని అందించేందుకు ''సాక్షి'' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మ్యాథ్స్ బీ పరీక్ష విజయవంతమైంది. విద్యార్థుల్లో ధైర్యాన్ని నూరిపోసింది. సులువుగా లెక్కలు చేసే విధానం, కూడికలు, తీసివేతలు తదితర అంశాలపై నిపుణులైన ఉపాధ్యాయులతో తయారు చేసిన ప్రశ్నపత్రం అందరినీ ఆలోచింపజేసింది. ఫలితంగా ‘గణితం సులువే.. ఉన్నత శిఖరాలెక్కేస్తాం’ అంటూ చిన్నారులు నినదించారు. గుంటూరు నగర పరిధిలో అరండల్‌పేటలోని కెనడీ, గోరంట్లలోని విజేత, నవభారత్‌నగర్‌లోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లతోపాటు, విజ్ఞాన్ హైస్కూల్లో ‘సాక్షి’ మ్యాథ్స్ బీ పరీక్ష అట్టహాసంగా జరిగింది. ఈ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 338 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను నాలుగు విభాగాలుగా విభజించి, ఆయా పాఠ్యాంశాల స్థాయిలో రూపొందించిన ప్రశ్నపత్రాలతో పరీక్ష నిర్వహించారు. పాఠశాలస్థాయిలో నిర్వహించిన మ్యాథ్‌బీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లా, రీజినల్ స్థాయికి ఎంపిక కానున్నారు.



విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కెనడి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో పరీక్ష రాస్తున్న చిన్నారులు

భయం పోయింది



గణితంపై భయాన్ని దూరం చేయడంలో సాక్షి మ్యాథ్‌బీ విజయం సాధించింది. లెక్కలు సులువుగా నేర్చుకోవచ్చని ప్రశ్నపత్రం భరోసానిచ్చింది. తోటి విద్యార్థులతో పోటీ పడి హాజరు కావడం ద్వారా భవిష్యత్తులో పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడంపై అవగాహన కలిగింది.

– సాయి దీక్షిత, 9వ తరగతి, విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్

సులువైన పద్ధతులు తెలిశాయి



గణితశాస్త్రంపై పట్టుకు మ్యాథ్ బీ ఉపయోగపడుతుంది. కఠినమైన లెక్కలను సులభంగా ఎలా చేయవచ్చో తెలిసింది. పరీక్షను ఎంతో ఉత్సాహంగా రాశాను. మార్కులు బాగా వస్తాయని భావిస్తున్నాను.

– మోహిత్‌సాయి, 8వ తరగతి, విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్

గణితంలో ప్రావీణ్యానికి దోహదం



సాక్షి మీడియా గ్రూప్ నిర్వహించిన మ్యాథ్ బీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. గణితంపై భయాన్ని దూరం చేసేందుకు కొత్త విధానాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన పరీక్ష ఆసక్తికరంగా సాగింది. ఇటువంటి పోటీ పరీక్షల వల్ల విద్యార్థుల మేధస్సు వృద్ధి చెందుతుంది.

– సురేష్, డైరెక్టర్, విజేత ఇంగ్లీషు మీడియం స్కూల్



కానుకల లెక్కింపులో వచ్చిన నగదును పరిశీలిస్తున్న దేవస్థాన అధికారులు

మూడో విడత ఆదాయం రూ.2.78 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలలో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల లెక్కింపు బుధవారం కొనసాగింది. బుధవారం మూడో విడత లెక్కింపులో రూ.2,78,28,703 నగదుతో పాటు 265 గ్రాముల బంగారం, 10.700 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో కేఎస్ రామారావు పేర్కొన్నారు. మూడు రోజులు మొత్తం రూ.8,73,53,943ల నగదుతో 994 గ్రాముల బంగారం, 38.395 కిలోల వెండితోపాటు విదేశీ డాలర్లు భారీగానే లభించాయని పేర్కొంటున్నారు. యుఎస్ఏ డాలర్లు 351, కెనడా డాలర్లు 80, ఆస్ట్రేలియా డాలర్లు 50, న్యూజిలాండ్ డాలర్లు 20, ఒమాన్ బైసాలు 300, యూఏఈ దిర్హమ్స్ 180తోపాటు ఈ హుండీ ద్వారా రూ. 1,97,207 విరాళాలు అందాయన్నారు. కానుకల లెక్కింపును ఈవోతోపాటు పాలక మండలి సభ్యులు, దేవదాయశాఖ అధికారులు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

పల్నాడులో 47.86 శాతం పింఛన్ల పంపిణీ



నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక బుధవారం జిల్లాలో 47.86 శాతం పంపిణీ చేశారు. ఈనెల 2,81,268 మందికి రూ.78,07,27,750లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా తొలిరోజు 1,34,625 మందికి రూ.37,39,16,750లను అందజేశారు.

యార్డుకు 35,478 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 35,478 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 35,076 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,800 నుంచి రూ.22,800 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,899 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

నాగార్జునకొండ సందర్శన



విజయపురిసౌత్: ప్రపంచంలోని 12 దేశాల బుద్ధిస్ట్ స్కాలర్స్ బుధవారం నాగార్జునకొండను సందర్శించారు. ఈ సందర్భంగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ సీనియర్ ప్రోగ్రాం డైరెక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు బౌద్ధమత వాసనలు కల్గిన 12 దేశాలకు సంబంధించిన బుద్ధిస్ట్ స్కాలర్స్ బుద్ధ భూమి వందన యాత్ర పేరుతో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా భారతదేశంతో పాటు థాయిలాండ్, తైవాన్, కంబోడియా, శ్రీలంక, మలేషియా, భూటాన్, జపాన్, లావ్స్, వియత్నాం, సౌత్‌కొరియా, నేపాల్ దేశాల బుద్ధిస్ట్‌స్కాలర్స్ ఈ సెమినార్లలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విషయ సేకరణలో భాగంగా భారతదేశంలోని బౌద్ధకేంద్రాలైన బుద్ధగయ, వారణాసి, సారనాథ్, ఔరంగాబాద్, అజంతా లాంటి ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను సందర్శిస్తూ నాగార్జునకొండను సందర్శించారని తెలిపారు. మొదటగా 33 మందితో కూడిన బృందం నాగార్జునకొండకు లాంచీలో వెళ్లారు. అక్కడ పునర్నిర్మితమైన కట్టడాలు, మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధుని ధాతువు, సింహళవిహార్, మహాస్థూపాన్ని సందర్శించారు. వీరికి టూరిజం గైడ్ సత్యనారాయణ చారిత్రక విశేషాలను వివరించారు.

బోధనేతర సిబ్బంది వయోపరిమితి పెంచాలి

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో విధులు నిర్వహిస్తున్న బోధనేతర సిబ్బంది ఉద్యోగ విరమణ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యేటిగడ్డ వెంకటప్పారెడ్డి ఏపీ ప్రభుత్వ చీఫ్‌సెక్రటరీ జవహర్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ఆధ్వర్యంలో వెంకటప్పారెడ్డి, ఉద్యోగ సంఘ నాయకులు బుధవారం చీఫ్ సెక్రటరీని కలిశారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఈ నిర్ణయాన్ని యూనివర్సిటీల్లోని అధ్యాపకేతర సిబ్బందికి కూడా వర్తింపజేయాలని కోరారు. దీనికి చీఫ్ సెక్రటరీ స్పందిస్తూ పదవీ విరమణ వయోపరిమితి పెంపును యూనివర్సిటీ అధ్యాపకేతర సిబ్బందికి కూడా వర్తింపజేస్తామని హామీ ఇచ్చారని ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు.



జాతీయపతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

అట్టహాసంగా అవతరణ దినోత్సవం

- అమరజీవి పొట్టిశ్రీరాములుకు నివాళి
- ఆంధ్రరాష్ట్ర చరిత్ర ఛాయా చిత్రప్రదర్శన ఏర్పాటు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నమస్కరిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: దేశంలో భాషా ప్రాతిపదికన ఏర్పాటైన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డితో కలిసి జాతీయ పతాక ఆవిష్కరణ చేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభను ఉద్దేశించి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 58 రోజుల ఆమరణ నిరాహారదీక్ష చేసి అసువులుబాసిన అనంతరం మూడు రోజుల తర్వాత ఆంధ్ర రాష్ట్ర అవతరణపై తొలిసారిగా ప్రకటన చేసినట్టు వివరించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ, సంస్కృతి చరిత్ర కీర్తిని నేటితరం తెలుసుకొనేలా ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి

పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం వల్ల భాషా పరంగా తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందన్నారు. పల్నాడు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు ఆవశ్యకత ఉందన్నారు. దీనికి కృషి చేస్తానని చెప్పారు. నవంబర్ నెలలోపు వరికెపుడిశెల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించుకుందామని వెల్లడించారు. ఎస్పీ రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రులు అంటే ఆరంభశూరులు కాదని నిరూపించి ఉద్యమం చేసిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన కాలంలో ఆయనను చులకనగా చూసినా దినాలు గడిచిన కొద్దీ దీక్షకు సంఘీభావం పెరిగి ఉద్యమం తీవ్రరూపం దాల్చిందన్నారు. విద్యా శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆంధ్ర చరిత్ర ఛాయాచిత్ర ప్రదర్శనను ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, ట్రైని కలెక్టర్ ప్రారంభించారు. ఫొటోలను పరిశీలించారు. జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర



విజయవాడ : భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర పేరుతో ప్రత్యేక పర్యాటక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ నుంచి బయలుదేరే ఈ ప్రత్యేక పర్యాటక రైలు ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్ స్టేషన్‌లలో ఎక్కి, దిగేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈనెల 18 నుంచి 30 వరకు సాగే ఈ ప్రయాణంలో ఉజ్జయిని (మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర), స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ద్వారకా, సోమనాథ్, పూణే, నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ పుణ్యక్షేత్రాలను సందర్శించొచ్చన్నారు. ఈ ప్యాకేజీలో ఒక్కొక్కరికీ స్లీపర్ క్లాస్ రూ.21వేలు, థర్డ్ ఏసీకి రూ.32,500, సెకండ్ ఏసీకి రూ. 42,500గా నిర్ణయించారు. ఆసక్తి కలిగిన వారు ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ ద్వారా కాని, విజయవాడ కార్యాలయం ఫోన్ నంబర్ల 9281495848, 9701360675 ద్వారా గానీ బుక్ చేసుకోవాల్సిందిగా కోరారు.

క్లుప్తంగా

అంతర్ కళాశాలల కబడ్డీ విజేత 'కృష్ణవేణి'



నరసరావుపేట: స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో రెండురోజుల పాటు నిర్వహించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాల పురుషుల కబడ్డీ పోటీల్లో మొదటి విజేతగా ఆతిథ్యమిచ్చిన కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు నిలిచారు. బుధవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో ద్వితీయ విజేతగా శింగరాయకొండ పీఎన్‌సీఏ కళాశాల, తృతీయ విజేతగా నగరం ఎస్‌వీఆర్ఎం కళాశాల, నాల్గవ స్థానాన్ని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీమ్ కైవసం చేసుకున్నాయి. విజేతలకు ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ శ్రీకాంత్, కృష్ణవేణి కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, లక్ష్యా కళాశాల ప్రిన్సిపాల్ బసవయ్య, శారదా కళాశాల డైరక్టర్ డి.నాగేశ్వరరావు ట్రోఫీ కప్‌లను అందజేశారు. ప్రత్యేక నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను అభినందించారు. పీడీ ఈదర ఆదిబాబు, మహమద్, ఎంఆర్‌కే సతీష్‌బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంపై సమీక్ష



యడ్లపాడు: ప్రజల నుంచి ఒకసారి వచ్చిన అర్జీ మరలా రాకుండా శాశ్వత పరిష్కారం చూపడం కోసమే జగనన్నకు చెబుదాం కార్యక్రమ లక్ష్యమని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. యడ్లపాడు రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. యడ్లపాడు టీటీడీ కల్యాణ మండపంలో సెప్టెంబర్ 27వ తేదీన జగనన్నకు చెబుదాం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మండలం నుంచి రెవెన్యూ పరమైన వివిధ సమస్యలపై వచ్చిన అర్జీల పురోగతిపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ సమస్యలపై అర్జీ సమర్పించిన లబ్ధిదారుడికి మండలస్థాయిలోనే శాశ్వత పరిష్కారం చూపాలని, సాంకేతిక కారణాలు, లేదా ఉన్నతాధికారుల పరిధిలోనిదైతే తమ దృష్టికి సత్వరమే తీసుకురావాలన్నారు. డీటీ శ్యామలత, ఆర్ఐ చక్రవర్తి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా పటిష్టం.. భద్రత కట్టుదిట్టం

- తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన పల్నాడు జిల్లా పోలీసులు
- 15 బోర్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు
- ప్రతి వాహనం క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే అనుమతి
- ఇప్పటివరకు 1,682 బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం
- 114 మంది రౌడీషీటర్లు బైండోవర్
- 101 మంది నుంచి వ్యక్తిగత ఆయుధాలు స్వాధీనం
- సరిహద్దు గ్రామాల్లో కార్డన్ సెర్చ్



తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్న మాచర్ల రూరల్ పోలీసులు

సాక్షి, నరసరావుపేట: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంతో సరిహద్దు పంచుకుంటున్న పల్నాడు పోలీసులు సరిహద్దులో భద్రతను కట్టుదిట్టం చేశారు. జిల్లా పోలీసులతో పాటు సరిహద్దు పోలీసులను సమన్వయం చేసుకుంటూ పహారా కాస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిర్వహించే మార్గాల్లో 24 గంటల పాటు డేగ కన్ను వేశారు. అక్రమమార్గంలో నగదు, మద్యం, వస్తువులు సరఫరా జరగకుండా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారు. చెక్ పోస్టుల వద్ద జరుగుతున్న తనిఖీల తీరును సీసీ కెమెరాల ద్వారా రికార్డు చేసి కంట్రోల్ రూం ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. గత సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలు అంతర్ రాష్ట్ర సరిహద్దు సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు జరిపారు.

15 బోర్డర్ చెక్ పోస్టులు...

పల్నాడు జిల్లాకు సరిహద్దుగా ఉన్న సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు రాకపోకలు సాగించే తొమ్మిది పోలీసు శాఖ చెక్‌పోస్టులు, రెండు ఎక్సైజ్ శాఖ, మూడు అటవీశాఖ, రవాణా శాఖకు చెందిన ఒక చెక్ పోస్టులో 24 గంటలు సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. ఇందులో పోలీసుశాఖ సాగర్ వద్ద టీ రోడ్డు చెక్‌పోస్టు, పొందుగల, తంగెడ, సత్రశాల, పులిచింతల డ్యాం, మాదిపాడు, గోవిందాపురం, రేగులగడ్డ, అమరావతిలో చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటిలో అనుమతికి మించి నగదు, బంగారం, ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలోని వస్తువులు ఉంటే సంబంధిత పేపర్లు చూపమని అడుగుతున్నారు. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే ప్రజలు రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లే క్రమంలో సంబంధించిన ఆధారాలతో వెళ్లాలని పోలీసుశాఖ సూచిస్తోంది. లేనిపక్షంలో నగదు, వస్తువులను సీజ్ చేస్తున్నారు.

1,682 బాటిళ్ల మద్యం సీజ్...

పల్నాడు జిల్లా పోలీసు శాఖ చేపట్టిన తనిఖీల్లో అక్రమ మద్యం పట్టుబడింది. 180 ఎంఎల్ మద్యం సీసాలు 1,469 , 750 ఎంఎల్ బాటిళ్లు 104, 375 ఎంఎల్ బాటిళ్లు 54, 500 ఎంఎల్ బాటిళ్లు 34, 650 ఎంఎల్ బాటిళ్లు 9, 275 ఎంఎల్ బ్రీజర్ బాటిళ్లు 12 సీజ్ చేశారు. అలాగే 185.5 లీటర్ల ఐడీ లిక్కర్, 4,100 లీటర్ల బెల్లం తేటను స్వాధీనం చేసుకున్నారు.

విస్తృతంగా కార్డన్ సెర్చ్..

పొరుగు రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో పల్నాడు పోలీసులు విస్తృతంగా కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలు, వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటికే దైద, విజయపురి సౌత్, కొత్త గంగరాజుపల్లి, గోవిందాపురం, సామదానంపేట గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అలాగే జిల్లాలోని 34 పోలీసుస్టేషన్ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. ఆయా గ్రామాల్లో కొత్తగా వచ్చిన, వారు నేర ప్రవృత్తి కలిగిన వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టిపెడుతున్నారు. జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలో 126 మంది గన్ లైసెన్స్ కలిగి ఉండగా తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో వాటిని సంబంధిత పోలీసు కార్యాలయాల్లో డిపాజిట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు 101 మంది తమ వ్యక్తిగత ఆయుధాలను పోలీసులకు అందజేశారు. మిగిలిన 25 మంది భద్రతా కారణాలతో షరతులతో ఆయుధాలు కలిగి ఉండటానికి అనుమతి ఇచ్చారు. మరోవైపు 91 మంది రౌడీషీటర్లు, 23 సస్పెక్ట్ షీటర్లను బైండోవర్ చేశారు.

ఎన్నికల నేపథ్యంలో చర్యలు తీసుకుంటున్నాం...



తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో డీజీపీ ఆదేశాలతో తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. సరిహద్దు చెక్ పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేశాం. సరిహద్దు గ్రామాల్లో కార్డన్ సెర్చ్, పల్లెనిద్ర వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మాత్రమే సరిహద్దు దాటే సమయంలో నగదు, బంగారం, ఇతర వస్తువులను కలిగి ఉండాలి. లేనిపక్షంలో వాటిని సీజ్ చేస్తున్నాం. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– వై.రవిశంకర్ రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

ఆత్మగౌరవం, స్వాభిమానం రాష్ట్రావతరణకు మూల కారణం

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ఆత్మగౌరవం, స్వాభిమానమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు మూల కారణమని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పల్నాడు పోలీసుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ రాష్ట్ర సాధనకోసం కృషి చేసిన మహనీయుల త్యాగాలకు గుర్తుగా జాతీయ జెండా ఎగురవేసి అధికారులు, సిబ్బందితో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణార్పణ చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలతో నివాళులులర్పించారు. తెలుగు జాతి స్వతంత్ర్యత, ప్రత్యేకత కోసం ఆయన చేసిన త్యాగం, కృషిని గుర్తుచేశారు. అదనపు ఎస్పీలు చంద్రశేఖర్, రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీఎస్పీ కేవీ మహేష్, సీఐలు, ఆర్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి సేవలు మరువలేనివి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు



రొంపిచర్లలో నివాళులర్పిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

పొట్టి శ్రీరాములుకు ఘననివాళులర్పించిన ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు

మాచర్ల: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలనే తృణప్రాయంగా ఎంచారని, అటువంటి మహనీయుని సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ మూడు జిల్లాల యువజన జోనల్ విభాగ ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు అన్నారు. బుధవారం పట్టణంలోని నెహ్రూనగర్‌లో వీవీఎస్ గార్డెన్స్‌లో జరిగిన సభలో ప్రజా ప్రతినిధులు, ఆర్యవైశ సంఘ నాయకులతో కలిసి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల, దుర్గి యార్డు చైర్మన్‌లు తాడి వెంకటేశ్వర రెడ్డి, వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ సభ్యులు మండ్లి పెద్ద మల్లుస్వామి, వడితే రూప్లీ బాలునాయక్, షేక్ షఫీ, శెట్టిపల్లి యలమంద, ఎంపీపీలు బూడిద శ్రీనివాసరావు, ఏసూరి సునీత, మేకల శారదా శ్రీనివాసరావు, దాసరి చౌడేశ్వరి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బత్తుల ఏడుకొండలు, తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతోమేలు

ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర కన్సల్టెంట్ కె.రామచంద్రం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ కన్సల్టెంట్ కె.రామచంద్రం

క్రోసూరు: ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పంటలను రైతులు సాగుచేయటం వలన పంటకు కావలసిన సూక్ష్మ పోషకాల అభివృద్ధి చెంది తెగుళ్ల బారిన పడకుండా పంట దిగుబడి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర కన్సల్టెంట్ కె.రామచంద్రం అన్నారు. గురువారం క్రోసూరు మండలంలోని క్రోసూరు నాలుగు రోడ్డుల సెంటర్లోని ప్రకతి వ్యవసాయ రైతుసేవ కేంద్రం ఏర్పాటు చేసిన మిరప రైతుల అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.అమలాకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్టేట్ కన్సల్టెంట్ రామచంద్రం ప్రకృతి వ్యవసాయ విధానం సాగుపై సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ప్రకతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ ప్రస్తుత కాల పరిస్థితుల ప్రకారం రసాయనాలు పురుగుమందులు లేకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను పండించడం వలన రైతులకు ఖర్చు తగ్గి అధిక ఆదాయం పొందవచ్చు అని అన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు ఎం.గోవింద్ రెడ్డి మాట్లాడారు. అడిషనల్ డీపీఎం ప్రేమ్ రాజ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పలు గ్రామాల సేంద్రియ వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

గురజాల డీఎస్పీ పల్లపురాజుకు ఉత్తమ సేవా పతకం



నరసరావుపేట: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సేవాపతకాల్లో జిల్లాలో ఉత్తమ సేవా పతకం ఒకరికి లభించగా, మరో ఇద్దరు సేవా పతకాలు అందుకున్నారు. ఉత్తమ సేవా పతకం గురజాలకు చెందిన డీఎస్పీ ఆకురాతి పల్లపురాజుకు లభించగా, నరసరావుపేట వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ బయ్యవరపు శంకరరావు, డీఎస్‌బీ విభాగంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న గుడ్లూరు వెంకట సీతారామాంజనేయులుకు సేవా పతకాలకు ఎంపికయ్యారు. జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అభినందించారు.

మేనమామ-మేనకోడలు దుర్మరణం

- వారధి వద్ద బలితీసుకున్న టిప్పర్ లారీ
- ఇద్దరూ కృష్ణా జిల్లా ముదినేపల్లి వాసులు



మృతి చెందిన దేగల సుబ్బారావు



మృతి చెందిన దాసరి విజయదుర్గ

తాడేపల్లిరూరల్: కనకదుర్గ వారధి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మేనమామ, మేనకోడలు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గిరిబాబు కథనం ప్రకారం కృష్ణాజిల్లా ముదినేపల్లికి చెందిన దేగల సుబ్బారావు (50), దాసరి విజయదుర్గ (28) వీరిద్దరు తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్న బంధువుని పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అయితే వారధి దాటిన తరువాత వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో దేగల సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందగా, దాసరి విజయదుర్గను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

పెన్సిల్ మొనలపై కర్ణాటక రాష్ట్ర అవతరణ వ్యాసం

కారంచేడు: పెన్సిల్‌తో వినూత్న కళ తీర్చిదిద్దింది ఓ డిగ్రీ విద్యార్థిని. కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెన్సిల్ మొనలపై ఆ రాష్ట్ర అవతరణపై వ్యాసం చెక్కింది. బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన అన్నం నరసింహారావు, భ్రమరాంబ దంపతుల కుమార్తె అయిన అన్నం మహిత ప్రస్తుతం డిగ్రీ చదువుతోంది. సూక్ష్మ కళలపై ఉన్న మక్కువతో అనేక కళాకృతులకు జీవం పోసింది. సుమారు 100 పెన్సిళ్లను ఉపయోగించి చెక్కిన వ్యాసాలను బుధవారం ప్రదర్శించింది.

జీజీహెచ్‌లో వైద్యసేవలు భేష్

ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు భేషుగ్గా ఉన్నాయని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి అన్నారు. బుధవారం జీజీహెచ్ శుశ్రుత హాలులో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముందుగా పొట్టి శ్రీరాము లు చిత్రపటానికి జిల్లా జడ్జి పార్థసారథి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను డాక్టర్ కిరణ్ కుమా ర్ ఆవిష్కరించగా జిల్లా జడ్జి పార్థసారథి తెలుగు తల్లి విగ్రహానికి పూల మాలలు వేశారు. ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ కార్పొరేట్ వైద్య సేవలు కంటే కామన్ సెన్స్ వైద్యం మేలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు ఉన్నత వైద్యం అందుతోందన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆసుపత్రి పేద రోగులను ఆదుకుని ప్రాణాలను కాపాడిందన్నారు. గుంటూరు మెడికల్ కళాశాల, జీజీహెచ్‌కి ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి కోసం ఎన్నో వైద్య పరికరాలను అందిస్తోందని, దాతలు అందిస్తున్న లక్షలాది రూపాయల విలువ గల పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. త్వరలో లివర్, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లో ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం గుండె ఆపరేషన్లు వారానికి ఒకసారి జరగడం నూతన ఒరవడికి శ్రీకారమని పేర్కొన్నారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశశ్వి, మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



కాపు వసతి గృహ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు



తెలగ అభ్యుదయ సంఘం నాయకులను అభినందిస్తున్న అంబటి మురళీకృష్ణ

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- గోరంట్లలో 300 పడకల కాపు వసతి గృహం ప్రారంభం

గుంటూరు రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. బుధవారం గోరంట్ల గ్రామంలో నూతనంగా తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 300 పడకల రఘుపతి వెంకటరత్నం నాయుడు కాపు విద్యార్థి వసతి గృహం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా కాపు విద్యార్థి వసతి గృహాన్ని ఏర్పాటు చేసిన తెలగ అభ్యుదయ సంఘాన్ని అభినందించారు. తెలగ అభ్యుదయ సంఘం కార్యదర్శి బాలిశెట్టి విజయ్ కుమార్ మాట్లాడుతూ అనేక మంది కాపు, తెలగ, బలిజ, ఒంటరి విద్యార్థుల విద్యాభివృద్ధికి వసతి గృహాన్ని ఏర్పాటుకు కృషిచేసిన ప్రతి కాపు, బలిజ, తెలగ, ఒంటరి నాయకులకు ప్రారంభోత్సవానికి వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, గుంటూరు మిర్చియార్డ్ డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వర్లు (ఇంద్ర) తదితరులు పాల్గొన్నారు.

తెలగ అభ్యుదయ సంఘానికి అభినందనలు

కాపు విద్యార్థులకోసం నూతనంగా 300 పడకలతో గోరంట్ల గ్రామంలో కాపు విద్యార్థి వసతి గృహాన్ని ఏర్పాటు చేసిన తెలగ అభ్యుదయ సంఘానికి అభినందనలు తెలుపుతున్నానని అంబటి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం నూతంగా ప్రారంభోత్సవాన్ని జరుపుకుంటున్న కాపు వసతి గృహాన్ని ఆయన సందర్శించి తెలగ అభ్యుదయ సంఘం నాయకులను అభినందించారు. కార్యక్రమంలో అభ్యుదయ సంఘం నాయకులు తదితరులు న్నారు.